1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం డిసెంబర్ 12, 2023 www.navatelangana.com

విద్యా ప్రమాణాలు పెంచాలి

నోడల్ అధికారి షౌకత్ అలీ

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న అలీ

విద్యార్థులకు తమదైన శైలితో విద్యాబోధన చేపట్టాలని నోడల్ అధికారి షౌకత్ అలీ అన్నారు. సోమవారం లింగంపేట్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి చదవడం రాయడం నేర్పించాలన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రతి పిల్లవాడు బడిలో ఉండేలా చూడాలన్నారు. పదాలు, ప్రణాళిక ఆధారంగానే విద్య బోధన చేపట్టినట్లయితే విద్యార్థులకు అర్థమవుతుందన్నారు. అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కోటేశ్వరరావు రవీందర్ శర్మ సి ఆర్ పి లు గంగాధర్ విజయ్ సంజీవులు సంఘు గౌడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమే కాకుండా దేహదారుఢ్యానికి సైతం ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాష్ట్రస్థాయి ఫుట్బాల్ అండర్ -17 మహిళల విభాగంలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆ క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కలెక్టర్ కార్యాలయావరణంలో మెమొంటో అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రయ్య, విజయలక్ష్మి, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ళు పూర్తి చేసుకుంటున్న వారందరిని ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ బూత్ వారీగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డిలతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం పట్ల సీఈఓ జిల్లా కలెక్టర్లను అభినందించారు. ఇదే తరహాలో త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటినుండే అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు.

ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటదివెంట పరిష్కరించాలని, జనవరి 06 వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తరువాత కూడా ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించి జనవరి 22 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుందని అన్నారు. వచ్చిన దరఖాస్తులను 2024 ఫిబ్రవరి 2 వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేసి, ఫిబ్రవరి 08 న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించిన వాటి విషయంలో సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలన జరిపించాలని, డూప్లికేషన్ లు లేకుండా చూడాలని, 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల వివరాలను మరోమారు సమగ్రంగా పరిశీలించాలని అన్నారు. ముఖ్యంగా 1450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించాలని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తూ, అందుకు గల కారణాలను అన్వేషించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమవుతున్న 'ఆటో'

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ జర్ని ఎఫెక్ట్
- గ్రామాల్లో ఆటోడ్రైవర్‌లపై ప్రభావం చూపుతున్న మహాలక్ష్మి పథకం
- కుటుంబ పోషణ భారం కానున్నట్టు ఆవేదన
- నెలతిరిగేసరికి మీదపడనున్న ఫైనాన్స్, ఈఎంఐ, చిట్టీలు
- తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపి ఆదుకోవాలని కోరుతున్న ఆటోడ్రైవర్లు

నవతెలంగాణ-భిక్కనూర్

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం.. తమకు తీవ్ర ప్రభావం చూపుతుందని ఆటో డ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా, డివిజన్ కేంద్రాల నుంచి మండలాలకు ప్రయాణికులను తరలించే ఆటోవాలలు ఉపాధి కోల్పోతున్నట్టు వాపోతున్నారు. బస్ టికెట్‌కు అనుగుణంగా చార్జి వసూలు చేస్తుండటంతో బస్సులు సమయానికి లేని సమయంలో మహిళా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించేవారని, ప్రస్తుతం ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లోనే వెళ్తున్నారని, దీంతో తాము ఆర్థికంగా చితికిపోయే అవకాశం ఉన్నట్టు పేర్కొంటున్నారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఆటోలకు ఒకటో తేదీ రాగానే ఫైనాన్స్‌లు, ఈఎంఐలు, చిట్టీలు కట్టాల్సి ఉందని, తమను సైతం ప్రభుత్వం ఆదుకొని తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతున్నారు.



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీవి ఆరు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి సుమారు 420 వరకు బస్సులు ఉన్నాయి. అన్ని బస్సుల్లో కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజు వారీగా సుమారు 1.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వీరిలో మహిళల సంఖ్యే ఎక్కువ. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా ఆరు గ్యారెంటీలల్లో రెండు గ్యారెంటీలను ఈ నెల 9వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఒకటి ఆరోగ్య శ్రీ వైద్య సాయం పది లక్షలకు పెంచగా.. మరో పథకం మహాలక్ష్మి కింద మహిళలకు ఆర్టీసీలోని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేసింది. అయితే ఈ పథకంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తుండగా.. ఆటో డ్రైవర్‌లు వాపోతున్నారు.



భిక్కనూర్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళలు, పురుషులు



ప్యాసింజర్‌లు లేక ఖాళీగా ఉన్న ఆటో

ఏ ఉపాధి లేని నిరుపేద కుటుంబాల వారు ఆటో నడుపుకొని జీవిస్తుండేవారు. ఫైనాన్సులలో అప్పులు చేసి నెలవారీగా చెల్లిస్తూ ఒక వైపు ఈఎంఐలు కడుతూ మరోవైపు కుటుంబాన్ని పోషిస్తూ జీవించే ఆటో డ్రైవర్లకు ఉచిత ప్రయాణం కారణంగా పూట గడవడమే కాకుండా ఫైనాన్స్, అప్పుల బాధలు, కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.

భిక్కనూర్ నుండి ఇటు రామాయంపేట్, అటు కామారెడ్డి వైపు ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కో ఆటోకు నాలుగైదు ట్రిప్పులు తిప్పుతుండటంతో డీజిల్ ఖర్చులు పోను రోజుకు 600 నుంచి 1000 రూపాయల వరకు సంపాదిస్తుండేవారు. కొన్ని సందర్భాలలో 500 రూపాయలు కూడా రావడం కష్టంగా ఉండేది. నెల తిరిగే సరికి ఆటో డ్రైవర్లు నెలకు 20 నుండి 25 వేల రూపాయలు సంపాదించే వారు. ఈ డబ్బులతోనే అటు ఫైనాన్స్‌లు, ఈఎంఐలు, చిట్టీల డబ్బులు కట్టుకుంటూ కుటుంబ పోషణకు వెచ్చించేవారు. వీటికి తోడు పిల్లల ఫీజులు, ఆటో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌లకు మరింత వెచ్చించాల్సిందే. అయినా రేయింబవళ్ల ఆటోను కష్టపడి నడుపుతూ బతుకుబండిని లాగించేవారు.

రోడ్డునపడుతున్నాం..

అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో తాము రోడ్డున పడుతున్నామని ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి స్కీమ్ అమల్లోకి రాగా.. రెండు రోజుల్లోనే ఆ ప్రభావం తమ మీద తీవ్రంగా చూపించినట్టు వాపోతున్నారు. గతంలో బస్సు వచ్చే వరకు ఎదురుచూడకుండా.. టికెట్ ధరతోనే ఆటోలో ప్రయాణం ఉండటంతో ఆటోలను సైతం మహిళా ప్రయాణికులు ఆశ్రయించేవారని, కానీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సులు వచ్చే వరకు ఎదురుచూస్తున్నారే గానీ తమ ఆటో ఎక్కడం లేదని ఆటోడ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోజుకు ఒక ట్రిప్పు కూడా సరిగా దొరకడం లేదని వాపోతున్నారు.

ఉద్యోగాలు లేక అప్పుచేసి ఆటో కొనుక్కొని జీవించే లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జీవన ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్ల సమస్యను వెంటనే పరిష్కరించి నిర్ణయం తీసుకోవాలని లేదా ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా జీవనోపాధి కల్పించాలని కోరుతున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించుకుంటే ఆటో డ్రైవర్లు అందరూ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తామని త్వరగా సమస్య పరిష్కరించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతున్నారు.

పూట గడవడం కష్టమవుతది

ఆంజనేయులు. ఆటో డ్రైవర్. భిక్కనూర్



కామారెడ్డి నుంచి భిక్కనూర్, రామాయంపేట్‌కు ఆటో నడుపుతుంటే రోజు 600 నుండి 1000 రూపాయలు వస్తుండేది. ఉచిత ప్రయాణం కారణంగా ఈ రోజు 200 రూపాయలు మాత్రమే వచ్చింది. ఇదే విధంగానే కొనసాగితే పూట గడవడం కష్టంగా మారుతది. ప్రభుత్వం ఆలోచించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

సిద్ధ రాములు (ఆటో డ్రైవర్). భిక్కనూర్



ఆటో నడుపుకొని జీవించే ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలి. ఉచిత ప్రయాణం కాకుండా సగం ధర టికెట్ నిర్ణయించిన బాగుంటుందని అనిపిస్తుంది. ప్రభుత్వం ఆలోచించి ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కరించాలని కోరారు.

మమ్మల్ని రోడ్డున పడేశారు

మల్లయ్య, బ్రాహ్మణపల్లి ఆటో డ్రైవర్)



మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి ఆటోలు నడుపుకుంటున్న మాలాంటి వారి పరిస్థితి రాను రాను ఎలా ఉంటుందో చెప్పడం కష్టంగా ఉంది. మా కుటుంబం మొత్తం ఆటో ఆదాయం పైన ఆధారపడి ఉంది. ఉచిత ప్రయాణం మాలాంటి వాళ్లం రోడ్డున పడే అవకాశం ఉంది.

చదువుకునే పిల్లలకు ఉచితంగా ఇవ్వాలి

షేక్ హుస్సేన్. ఎల్లారెడ్డి ఆటో డ్రైవర్.



మహిళలు ఉచిత ప్రయాణం వల్ల ఆటో నడుపుకుంటున్న మాకు ఉపాధి లేకుండా పోతుంది. నిన్న మొన్నటి వరకు రోజుకు అన్ని ఖర్చులు పోను 500, 600 మిగిలేవి. నేడు ఆటో మెయింటె నెన్స్ వెళ్లడం కష్టంగా ఉంది. చదువుకునే పిల్లలకు ఉచిత ప్రయాణం ఇస్తే బాగుంటుంది.

ఆటోలను ఆశ్రయంచట్లే..

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రతిరోజు నిజాంసాగర్ చౌరస్తా నుండి రాజంపేట్, చిన్న మల్లారెడ్డి, సోమవారం గ్రామం తదితర గ్రామాలకు వెళ్లే మహిళలు ఎక్కువగా ఆటోలను ఆశ్రయించే వారు. నిత్యం సుమారు ఒక్కొక్క ఆటోలో 8 నుండి పది మందిని ఎక్కించుకొని ఐదారు ట్రిప్పులు తిరేగే వాళ్లమని, ప్రస్తుతం తమ వైపు చూడటం లేదని ఆటోడ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి సిఎస్‌హెచ్ నుండి అడ్లూరు ఎల్లారెడ్డి, కుప్రియాల్, బ్రాహ్మణపల్లి, సదాశివనగర్ మండల కేంద్రానికి సైతం తమ ఆటలలో మహిళలు ప్రయాణించే వారని, ప్రస్తుతం ఉచిత ప్రయాణంతో ఎవరు కూడా మా ఆటోల వద్దకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు తాము 5 ట్రిప్పులు వేసుకొని ప్రతిరోజు వెయ్యి రూపాయల వరకు సంపాదన ఉండేదని ప్రస్తుతం ఒక ట్రిప్ వెళ్లడం రెండో ట్రిప్ లో మహిళలు లేకపోవడంతో తాము ఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. మొన్నటి వరకు వచ్చిన డబ్బులతో తాము నెట్టుకొస్తున్నామని ఆ డబ్బులు అయిపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు జీవనోపాధికి దెబ్బ తగలకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు.

శాఖల వారీగా నివేదికలు

- సిద్ధం చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణికి 30 వినతులు

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

శాఖల వారిగా అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలను అధికారులు తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం పాల్గొని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన 30 ఫిర్యాదులను, వినతులను ప్రజల నుంచి కలెక్టర్ తో కలిసి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ స్వీకరించారు. పూర్తయిన అభివృద్ధి పనులు, పెండింగ్లో ఉన్న పనుల వివరాలు అధికారులు సేకరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖ పదహారు, మున్సిపల్ శాఖకు మూడు. భూ కొలతల రికార్డుల శాఖకు ఒకటి, ఎంప్లాయిమెట్ ఆఫీస్కు ఒకటి, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి నాలుగు, జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయానికి 1, కలెక్టరేట్ కార్యాలయానికి రెండు, సివిల్ సప్లై అధికారి కార్యాలయానికి 1, జిల్లా పోలీస్ అధికారి కార్యానికి 1 మొత్తం సోమవారం 30 ఫిర్యాదులు అందాయి.

పాలకుడిని కాను.. సేవకుడిని

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తా
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

'నన్ను భారీ మెజారిటీతో గెలిపించిన ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు. ఇవాళ్టి నుండి నేను పాలకూడిని కాదు.. ప్రజా సేవకూడిని. ఎన్నికల ప్రచార సమయంలో చెప్పినట్లు హామీలు అన్ని నెరవేరుస్తాను. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రజల ప్రభుత్వం అని' ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా ఎల్లారెడ్డికి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి నాంది పలికిన మరుసటి రోజు ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే ప్రయత్నం ప్రారంభించిందని ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందని ఇకపై ఎల్లారెడ్డి నియోజకవర్గ మహిళలంతా కామారెడ్డి కానీ నిజామాబాద్ గాని హైదరాబాద్ గాని ఒక్క రూపాయి లేకుండా వెళ్లే అవకాశం కల్పించామని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా మన పిల్లలకు ఆర్థిక స్వతంత్రం కూడా దక్కిందని అన్నారు. ప్రయాణ చార్జీల ద్వారా మిగిలి మొత్తాన్ని తమ పిల్లల భవిష్యత్తుకు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇక మన ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ మొత్తాన్ని 10 లక్షల రూపాయలకు పెంచిందని దీంతో ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రతి ఒక్కరు ఆరోగ్య రక్ష దక్కుతుందని ఇకపై ఎల్లారెడ్డి ప్రజలకు ఎంతటి పెద్ద ఆరోగ్య సమస్యలు ఉన్నా వారు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఉచిత వైద్యం పొందేందుకు ఏ ఆస్పత్రిలో అయితే మాజీ సీఎం తుంటి ఆపరేషన్ చేయించుకున్నాడు అక్కడే సామాన్యులు కూడా ఆపరేషన్లు చేయించుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మేనిఫెస్టోను హామీలకు నూటికి నూరు శాతం అమలు చేస్తామని అన్నారు. దాంతో పాటుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను కూడా అమలు చేస్తానని తెలిపారు.

దొంగే.. దొంగా అని అరిచినట్టుంది

- అవినీతిపై మాట్లాడే ముందు.. నీ అవినీతిపై సమాధానం చెప్పు : కాంగ్రెస్

నవతెలంగాణ-కామారెడ్డి

దొంగే.. దొంగా దొంగా అని అరిచినట్టు అనేక అవినీతి పనులు చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి.. షబ్బీర్‌అలీని విమర్శించడం విడ్డూరంగా ఉందని డీసీసీ ప్రెసిడెంట్ కైలాస్ శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'నీకు జెడ్పిటిసి గా గెలిపించి జెడ్పీ చైర్మన్ గా చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా బీఫామ్ ఇస్తే టీఆర్‌ఎస్ పార్టీకి అమ్ముకున్న దొంగవు. బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డితో నీకు సంబంధం ఏంటి ? ఎమ్మెల్సీ పోటి నుండి విత్ డ్రా చేస్తే ఏడు కోట్లు ఇచ్చాడని ఆ ఏడు కోట్ల ద్వారా బెంగళూరులో 17 కోట్ల సంపాదించానని 17 కోట్లతో ప్రోబేల్స్ స్కూల్ కొన్నానని నీ నోటి ద్వారానే నువ్వే అన్నావు కదా దానికి నీ సమాధానమేంటి ?. కామారెడ్డి డిగ్రీ కళాశాలకు చెందిన భూములను మీ తండ్రి నీవు ఎడ్యుకేషన్ సొసైటీగా తయారు చేసుకుని, ఆ స్థలాన్ని అరోరా ఇంజనీరింగ్ కాలేజీ కి దారదత్తం చేసి వారి పేరు మీద యూకో బ్యాంకులో విద్యాలయ భూములు 26 ఎకరాలు కుదవ పెట్టి ఏడు కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా. షబ్బీర్ ఓటమి గురించి మాట్లాడుతున్నావ్.. ఆ విషయంలో నీవు కామారెడ్డి లో కౌన్సిలర్ గా కూడా గెలవకుండా మూడో స్థానంలో నిలిచావు. నీకు రాజకీయ జన్మ ఇచ్చింది షబ్బీర్ అలీ అని స్వయంగా నీవే మాట్లాడావు మర్చిపోయావా ?' అని ప్రశ్నించారు.


అంతంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 146 లో గల 1 ఎకరం 12 గుంటల భూమిని వెంకటరమణారెడ్డి అతని బంధువులు కలిసి రైస్ పుల్లింగ్ పేరుతో అధిక లాభార్జన ఆశ చూపి తన స్వలాభం కోసం అమాయకుడైన నరసింహారెడ్డిని మోసం చేసి భూమిని కబ్జా చేశారని బాధితులు పేర్కొన్నట్టు తెలిపారు. ఈ విషయంపై కామారెడ్డి సీఎస్ఐ గ్రౌండ్‌లో మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నామని నీకు దమ్ముంటే రావాలని సవాల్ విసిరిన నువ్వు రాలేదన్నారు. ఉద్యోగులు షబ్బీర్ అలీ ఇంట్లో పని చేస్తుంటే ఇన్నేండ్లుగా ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. ఆయన వద్ద పనిచేసే వ్యక్తిగత కార్యదర్శి మైనార్టీ విభాగంలో కాంటాక్ట్ వర్క్ చేసేవారని, అక్కడ మూడు సంవత్సరాల నుండి జీతం రాకపోవడంతో షబ్బీర్ అలీ వద్ద జీతం చేస్తున్నాడని, అసలు విషయాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

నాయక్ అనే వ్యక్తి ఏ డిపా డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడో అక్కడికి వెళ్లి అతని వ్యక్తిగత హాజరు పట్టికను పరిశీలిస్తే వాస్తవం తెలుస్తుందని, ఒక గిరిజనుడి మీద మాట్లాడే ముందు వెనుక ముందు ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, మాజీ సి డి సి అధ్యక్షుడు అశోక్ రెడ్డి, జెడ్పిటిసి నా రెడ్డి మోహన్ రెడ్డి, భిక్కనూర్ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, బిబీపేట్ మండల అధ్యక్షుడు సుతారి రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నౌసీ లాల్, ఐరేని సందీప్, పంపరి లక్ష్మణ్, గోనె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అనుచరుల కోసం ఆత్మీయ సమ్మేళనాలు

- స్థానిక ఎన్నికల కోసం ఇప్పటి నుంచే జాగ్రత్తలు

నవతెలంగాణ-వర్ని



మున్ముందు పల్లె పోరు రాబోతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు తమ అనుచరులను పార్టీలు మార కుండా ఉండేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గ్రామ స్థాయి కార్యకర్తలు ,అనుచరులు ఎక్కడ జంపులు చేస్తారోఅని ముందస్తుగా ఆత్మీయ సమ్మేళనలు పేరుతో కార్యక్రమాలు జోరందుకున్నాయి. లక్షలు వెచ్చించి కార్యకర్తలను కాపాడుకుంటున్నారు. ఓడినా, గెలిచినా కార్యకర్తల సంక్షేమం చూసుకుంటాం అంటూ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని నాయకులు కార్యకర్తలకు హామీలిస్తున్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో పట్టు నిలపుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఓడినా ప్రజల్లోనే ఉంటానని రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అని ఒకరు, లోకల్‌గా తమదే అధికారం అంటూ మరోకరు.. పార్టీకి పట్టు పెంచుకుందాం అంటూ ఇలా ఒక్కో పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించుకుంటున్నాయి. జనవరి 30కి సర్పంచ్‌లు, మరో రెండు నెలలకు ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవి కాలం పూర్తయితే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున.. ఆయా పార్టీ వారే అత్యధిక స్థానాలు గెలిచేలా ఇప్పటి నుంచి ప్రణాళికలు రచిస్తున్నారు.

రైతులకు నిజాంసాగర్ నీరు ఇవ్వాలి

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గ రైతులు యాసంగి వరి నాట్లు వేస్తున్నారని, నిజాంసాగర్ నీరు విడుదల చేయాలని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌ను, చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ శ్రీనివాస్‌ను కలిసి కోరారు. వారు నీరు విడుదలకు అంగీకరించటంతో వారికి అభినందనలు తెలిపినట్లు వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా ఒక ప్రకటనలో తెలిపారు. నేడు నిజాంసాగర్ వద్ద నీటిని రవీందర్ రెడ్డి విడుదల చేస్తున్న సందర్భంగా కార్యకర్తలు విచ్చేయాలని అయన కోరారు.



ఇరిగేషన్ శాఖామంత్రిని కలిసిన రైతులు

సామాజిక తనిఖీ గ్రామసభలు

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 14న జరిగే సోషల్ ఆడిట్ గ్రామ సభలు పురస్కరించుకొని మండలంలోని కూనేపల్లి, కళ్యాపూర్, దూపల్లి, బోర్గం, సాటాపూర్ గ్రామాల్లో సోమవారం సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభలో పలు సమస్యలపై చర్చించారు. కూనేపల్లి, సర్పంచ్ రొడ్డ విజయ లింగం, కాశం నిరంజని సాయిలు, శనిగరం సాయ రెడ్డి, పార్థ వాణి సాయి రెడ్డి, వికార్ పాషాల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసిన పనుల విషయంపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో రమణ, ఆయా గ్రామాల డీఆర్పీలు, కార్యదర్శులు శివకృష్ణ, రోజా, సిహెచ్ సాయిలు, సుమన్, మహబూబ్ అలీ, క్షేత్ర సహాయకులు, యాదగిరి, బంటి రమేష్, సాయిలు, హర్షద్ పాషా, అర్జున్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి వర్యులు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో కేసీఆర్ ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెండు రోజుల్లో కేసీఆర్ డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని అన్నారు.



సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే



స్వాగతం పలుకుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందుకుర్తిలోగల సీతారామా చంద్ర స్వామిని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. త్రివేణి సంగమానికి వచ్చిన సాధువులకు స్వాగతం పలికారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో లక్ష దీపోత్సవం, 108కలశాల పూజ, గంగాహారతి నిర్వహించారు. ఇందులో సూర్యనారాయణ పాల్గొన్నారు. ప్రధాన ఘాట్లపై దీపారాధన చేశారు. అన్నదానం చేశారు. సాధువులకు భక్తులు మంగళవా హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాశి నుంచి నాసిక్ వరకు గోదావరి పరిక్రమణ యాత్ర సాగుతుందని అన్నారు. ఈ యాత్ర లో గుజరాత్ రాష్ట్రానికి చెందిన మంగళ పీఠాధిపతి మాధవ చార్య ఆశీర్వాదం తీసుకున్నారు. ట్రస్ట్ ద్వారా అనేక దేవాలయాలకు తనకు తోచినంత సహాయ సహకారాలు అందించారు. అందులో భాగంగా ఇక్కడ సీతారాముల విగ్రహాలను అందించడం జరిగిందని అన్నారు. శ్రీ సీతారాం దాం సంత్ సేవాశ్రమం మహారాజ్ సీతరం త్యాగీ, రెంజల్ జడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ లోలం కిషోర్, వైస్ ఎంపీపీ యోగేష్ బీజేపీ నాయకులు గోవింద్, మహేష్,రమేష్, అంజగౌడ్, నిజామాబాదు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఒక్కో మొక్క బాధ్యతను ఒక్కో విద్యార్థికి అప్పగించాలి



పాఠశాల అవరణలో మొక్కలు నాటిన సర్పంచ్ సక్కారం అశోక్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటిన మొక్కల రక్షణ కోసం కంచెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ... నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌కు సూచించారు. ఒక్కో మొక్కను ఒక్కో విద్యార్థికి సంరక్షణ కోసం అప్పగించడం ద్వారా వారిలో పర్యావరణం పట్ల ఆసక్తిని పెంచేందుకు దోహదపడుతుందన్నారు. విద్యార్థులు కూడా మొక్కల బాధ్యతను స్వీకరించడం ద్వారా వారిలో బాధ్యతల పట్ల నిబద్ధత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, వార్డు సభ్యులు సాగర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, సక్కారం నారాయణ, బందెల రాజు, ఆర్పీ రాజు, అబ్బాస్, ఇజీఎస్ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ మామిడిపల్లి, ఆర్మూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించబడుతుందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం, నిజామాబాద్ అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్ (కామారెడ్డి, నిజామాబాద్) జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చు అని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుండి 24 వరకు జరిగే 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల మహిళ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తికి రిపోర్టు చేయాలని పేర్కొనారు.

చౌట్‌పల్లి పాఠశాలలో భారతీయ భాష మహోత్సవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని భారతీయ భాష మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులకు కథల పోటీలు, పజిల్స్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాతృభాష తెలుగు గొప్పదనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంధ్రయ్య, తెలుగు భాష ఉపాధ్యాయులు బంతిలాల్, ఉపాధ్యాయులు మధుబాబు, శ్రీనివాస్, వర్ష తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణిలో అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 38 ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టారు.



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై చేపట్టిన చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్ లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఎంపీడీవోలు, కార్యదర్శులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ని సోమవారం నిజామాబాద్ రూరల్ నీయోజకవర్గం లోని 7 మండలలకు చెందిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించినట్లు ఎంపిడివో రాములు నాయక్, టీవీ ఎస్ గోపి బాబు లు తెలిపారు . రూరల్ లోని సిరికొండ ఎంపిడివో లక్ష్మి ప్రసాద్, దర్పల్లి ఎంపిడిఓ లక్ష్మణ్, జక్రన్ పల్లి ఎంపి డివో బ్రహ్మానందం, మోపాల్ ఎంపిడివో లింగం, నిజామాబాద్ రూరల్ ఎంపిడివో మల్లేష్,ఇందల్ వాయి ఎంపిడివో రాములు నాయక్,డిచ్ పల్లి ఎంపిడివో టివిఎస్ గోపి బాబు అందరు కలిసి ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ని సన్మానించినట్లు పేర్కొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవోలు

ఇందల్‌వాయి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ని సోమవారం ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ అధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యకమంలో చంద్రయాన్ పల్లి కార్యదర్శి శ్రీ లత, అరుణ, శ్వేత, ప్రీత్మ, సువార్త, రజని, సంధ్యారాణి, లావణ్య, అశోక్, మహేష్, నాగేష్, అశ్వంత్, తదితరులు ఉన్నారు.

రైల్వే టికెట్స్, పార్కింగ్ చార్జీలు తగ్గించాలి

- పి.డి.ఎస్.యూ.పి.వై.ఎల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే టికెట్స్, టూవీలర్ పార్కింగ్ చార్జీలు తగ్గించాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పి.వై.ఎల్ జిల్లా అధ్యక్షుడు వనమల సత్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో డిప్యూటీ స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ గారికి పి.డి.ఎస్.యూ ,పి.వై.యల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్ల లో ప్యాసింజర్ మరియు ఎక్స్ ప్రెస్ రైళ్ల టికెట్స్ విపరీతంగా పెంచటం జరిగిందని వాటిని వెంటనే తగ్గించాలని ,టు విల్లర్ పార్కింగ్ చార్జీలు రోజు కి 60 రూ. వసూలు చేస్తున్నారని , సికింద్రాబాద్ వరకు డబుల్ లైన్ ఏర్పాటు చేయాలని ,స్టూడెంట్స్ కి ఉచిత రైల్వే పాస్ లు ఇవ్వాలని,

రైల్వే స్టేషన్ లో త్రాగునీరు సరిగ్గా లేక ప్రయాణికులు బయటకొనుక్కునే పరిస్థితి ఉందని , పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘము జిల్లా కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి మరియు పి.డి.ఎస్.యూ ,పి.వై.ఎల్ నాయకులు వసరి సాయినాథ్, భాస్కర్, మనోజ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేత

ఇంటిస్థలాలకు పట్టాలు మంజూరు చేయండి

- తహసీల్దార్‌కు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

గుడిసెలు వేసుకుని ఎన్నోఏండ్లుగా ఉంటున్న స్థలాలకు ఇంటి పత్రాలు మంజూరు చేయాలని మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన నిరుపేదలు కోరారు. ఇళ్ల స్థలాలను గత ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేశారని అన్నారు. సోమవారం సిపిఐ (ఎం) ఎడపల్లి మండల కార్యదర్శి జంగం గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మోతి సింగుకు వినతి పత్రాన్ని అందజేశారు. 15 ఏండ్లుగా తాము గుడిసెలు వేసుకొని జీవిస్తున్నప్పటికీ తమకు ఇంటి స్థలాల పట్టాలను మంజూరు చేయడం లేదని మహిళలు, నాయకులు తహసీల్దార్‌కు విన్నవించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిరుపేదలకు నివాసముండేందుకు ఇచ్చిన స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోతి సింగ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పేదలు బాలు, లక్ష్మి, జానకంపేట గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, పేదలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ క్రీడాకారిణి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ఆర్.ప్రణతి అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమ చారి తెలిపారు. ఈనెల 13 నుండి 15 వరకు నారాయణపేట జిల్లాలో జరిగే వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రణతిని సర్పంచ్ చేతన విజయ రెడ్డి , ఉప సర్పంచ్ నాయిక రాజు, ఎంపీటీసీ జయ గిరిధర్ గౌడ్, ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ, గ్రామ కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాధితునికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని యెల్లారెడ్డిపల్లి గ్రామంలో ఏడురోజుల క్రితం ప్రమాదవశాత్తూ పులి సాయిలుకు చెందిన నివాస గృహం అగ్ని కి ఆహుతి అయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బిజెపి నిజామాబాద్ రూరల్ ఇంచార్జీ కులచారి దినేష్ కూమార్ సోమవారం సందర్శించి భాదిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించి పరామర్శించారు. బిజెపి గ్రామ శాఖ అధ్వర్యంలో భాదితుడు పులి సాయిలుకు 80వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిజెపి ఇందల్ వాయి మండల అధ్యక్షులు నాయుడు రాజన్న శ్రావణ్, బాలరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దినేష్ కుమార్

రేపు ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల13న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు నియామకాలు ఎఫ్ఎస్ఈ సీనియర్ ఎఫ్ఎస్‌సీ ఎస్‌జీఎల్ టీం లీడర్ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హత ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, సాలరీ రూ.20నుండి 30వేలు, ఇన్‌సెంటివ్ ఉంటుందని పేర్కొన్నారు. వయోపరిమితి 18 సం'ల నుండి 30 సం'ల వరకు ఉండాలని, అసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లా ఉద్యోగమేళా పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు 9581768413, 9948748428, 9959456793, ఫోన్ ద్వారా సంప్రదించాలని, ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల లోపల తేదీ 13-12-2023 నాడు జిల్లాఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్ పాల్గొనాలని పేర్కొన్నారు. బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో, సర్టిఫికెట్స్ తెచ్చుకోవాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం

నవతెలంగాణ-కమర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన ఆకోజి అజయ్ లావణ్య దంపతులు వారి పిల్లల చేతుల మీదగా తమ వంతు సహాయంగా సోమవారం రూ.25వేలు విరాళంగా అందజేశారు. అజయ్ దంపతులకు అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారికి వారి కుటుంబానికి అయ్యప్ప ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, అయ్యప్ప మాలధారణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ మండల సమైక్యలో అవకతవకలపై విచారణ జరపాలి

- లేకుంటే లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని డ్వాక్రా మహిళా గ్రూపుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని మూడు నెలల కిందట ఫిర్యాదు చేసిన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు రుణాలు, శ్రీనిధిలో జరిగిన అవకతవకలపై ఏపిఎం, సీసీలను ఇక్కడి నుంచి పంపించినప్పటికీ, తిరిగి ఇక్కడికే రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వారి స్థానాలలో మరొకరికి పంపించి విచారణ జరపాలని వారు కోరారు. వనిత వివో సిఎ నవ్య అవకతవకలకు పాల్పడిందని ఆరోపిస్తూ ఆమె తమకు వద్దని స్పష్టం చేశారు. ఐకెపి సిబ్బంది టార్గెట్‌ను పూర్తి చేసుకోవడానికి డ్వాక్రా మహిళల రుణాలు రికవరీ కాకుండానే తిరిగి రుణాలను ఇవ్వడంతో, వారు తీసుకున్న రుణాలు పూర్తికాకుండానే తిరిగి రుణాలు ఇవ్వడంలో మతలబు ఏమిటని వారు ప్రశ్నించారు. ఐకెపి అధికారులు ఈ విషయంపై స్పందించకపోయినట్లయితే జరిగిన అవకతవకలపై సంబంధిత అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఐదు డ్వాక్రా సంఘాలవారు అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో పూజ, సులోచన, కావేరి ,ఇందిరా, రాధిక, లత, జ్యోతి, రజిత ,లక్ష్మి, రేఖ, తదితరులు పాల్గొన్నారు...

ఆయుర్వేదంతో ఎన్నో వ్యాధులు నయం చేయవచ్చు

- ప్రభుత్వ ఆయుర్వేదిక డాక్టర్ లలిత



వైద్యం చేస్తున్న ఆయుర్వేదిక డాక్టర్ లలిత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆయుర్వేద వైద్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆయుర్వేద వైద్యంతో ఎన్నో వ్యాధులు నయం చేయవచ్చని మండల ప్రభుత్వ ఆయుర్వేదిక్ డాక్టర్ లలిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వ ఆయుర్వేదిక ఉచిత వైద్య శిబిరం పడకల్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ప్రభుత్వ ఆయుర్వేదిక వైద్యురాలు లలిత తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు లలిత మాట్లాడుతూ కీళ్లవాతం, గ్యాస్ ట్రబుల్, మెడ నొప్పులు, స్త్రీల రుతుక్రమానికి సంబంధించిన వ్యాధులు, రక్తహీనత, మల బద్ధకం, కిడ్నీలో రాళ్లు, దగ్గు జలుబు, జ్వరం లాంటి తదితర వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని తెలిపారు. రోగులను పరీక్షించి ఉచితంగా పందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫార్మసిస్టులు వరలక్ష్మి, ఏఎన్ఎం సరిత, భారతి, మహేందర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి గోపికృష్ణ సోమవారం క్షేత్రస్థాయిలో పొగాకు, శనగ, పొద్దుతిరుగుడు పంటలను ఆయన పరిశీలించి రైతులకు సస్య రక్షణచర్యల రైతులకు వివరించారు. శనగ పంటకు పచ్చ పురుగు, పొద్దు తిరుగుడు, పొగాకు పంటకు లద్దె పురుగు సోకి ఆకులను తినేస్తున్నాయని, వాటి నివారణకు వివిధ రకాల మందులను పిచికారి చేయాలని రైతులకు సూచించడం జరిగింది.

15న చందూర్ మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-వర్ని

ఈ నెల 15న శుక్రవారం చందూర్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ నిలవతి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సమావేశం కు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదయం 10:30 గం లకు హాజరు కావలని ఆమె తెలిపారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

● మెడికల్ ఆఫీసర్ యేమిమా



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి సోమవారం నిర్వహించే అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యులు యేమిమా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనలు సలహాలు పాటించి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అలాగే 16 న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన సిద్ధరామేశ్వర ఆలయం

నవతెలంగాణ-భిక్కనూర్

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భిక్కనూరు పట్టణంలో ఉన్న దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో తెల్లవారుజాము నుండి భక్తులు మూలభావి వద్ద స్నానాలు ఆచరించి ఆలయంలో అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అలాగే అన్నదానం, మంచినీటి సదుపాయం కల్పించినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

● జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు ● నియోజకవర్గ అధికారులతో సమీక్ష

● ప్రారంభం కాని, పెండింగ్ పనుల వివరాలు అందజేయాలని అధికారులకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజక అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, ఇందుకు తన పూర్తి సహకారముంటుందని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మికాంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి,. నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, విద్య, వైద్య సంక్షేమ శాఖాధికారులు, జుక్కల్ నియోజక వర్గ అధికారులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్య, మంచినీటి సరఫరా, రోడ్ల పై జుక్కల్ నియోజక వర్గంలో ప్రగతిలో ఉన్న పనులు, పెండింగ్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అధికారులు చక్కటి కార్యాచరణ ప్రణాళికతో చిత్తశుద్ధిగా పనిచేయాలని కోరారు. విద్య వైద్య శాఖలో డిప్యుటేషన్ లో ఉన్న, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, ప్రగతిలో ఉన్న పనులు, సమస్యలపై రెండు రోజులల్లోగా నివేదిక అందజేయవలసినదిగా కోరారు. గ్రామంలోని చివరి ఇంటి వరకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటూ అంతవరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య పరీక్షలు, టాయిలెట్స్ తదితర చిన్న చిన్న పనులు పూర్తి చేయాలన్నారు. విద్య అందించడం ఖర్చుగా కాకా పెట్టుబడిగా చూడాలని, విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్యనభ్యసించుటకు అవసర మైన మౌలిక వసతులతో పాటు విద్యార్థుల కనుగుణంగా పాఠశాలలో టీచింగ్ స్టాఫ్ ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రతి తండా, గ్రామానికి రోడ్డు రవాణా సౌకర్యం మెరుగ్గా ఉండేలా చూడాలని అన్నారు.

ఎంపిడిఓలకు తమ మండలంలో గ్రామాలలో నెలకొన్న సమస్యలు తెలుసునని, అట్టి వివరాలను నిర్భయంగా తెలుపుతూ జాబితాను అందజేయాలని కోరుతూ, ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన మనం స్వేచ్ఛగా 20-20 మ్యాచ్ మాదిరి అత్యంత వేగవంతంగా పనిచేయాలని అధికారులకు హితవు పలికారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రగతిలో ఉన్న పనుల వివరాలతో పాటు ఇంతవరకు మొదలు పెట్టని, టెండర్ కానీ పనుల వివరాలు అందించాలన్నారు. విద్య వైద్య, తదితర శాఖలలో ఉన్న సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తేవాలని అన్నారు. నివాస గ్రామం వారీగా మిషన్ భగీరథ నీరు సరఫరా కానీ ప్రాంతాలను గుర్తించాలన్నారు. వివిధ శాఖలలో ప్రగతిలో ఉన్న పనుల వివరాలతో పాటు ఇంతవరకు మొదలు పెట్టని, టెండర్ కానీ పనుల వివరాలు అందించాలన్నారు. విద్య వైద్య, తదితర శాఖలలో ఉన్న సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తేవాలని అన్నారు.సంక్షేమ వసతి గృహాలు మరింత మెరుగుపరచుదుటకు అవసరమైన మౌలిక సదుపాయాలపై నివేదిక అందించాలన్నారు.

నివాస గ్రామం వారీగా మిషన్ భగీరథ నీరు సరఫరా కానీ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని, ముగింపు దశలో ఉందని, వచ్చే పంటకాలానికి సరైన ప్రణాళిక రూపొందించవలసినదిగా వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. చెరువుకట్టల బండ్ స్ట్రెంత్ కొరకు ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. మొబైల్ క్లినిక్ ల ద్వారా పశు వైద్య సేవలందిస్తున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు. బి.టి. రోడ్ల రెన్యువల్ చేపట్టాలని, వచ్చే సమావేశంలో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాల కనుగుణంగా చేసిన పనులపై (పారా మీటర్) సమీక్షిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓలు, అధికారుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో పంచాయత్ రాజ్, ఆర్ అండ్ బి, నీటిపారుదల, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్, విద్యుత్ ఎస్ ఈ రమేష్ బాబు, పశు సంవర్ధక అధికారి సింహ రావు,, ఎస్సి కార్పొరేషన్ ఈ డి దయాకర్ రావు, భాగ్యలక్ష్మి, రమ్య, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు ఎస్పీ సింధుశర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అంతకుముందు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు



ఎస్పీ సింధుశర్మను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

45 లక్షలతో మార్కెట్ యార్డులో వసతులు

● ఏఎంసీ చైర్మన్ హనుమంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో మౌలిక వసతుల ఏర్పాటు కోసం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో రూ.45 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు, అభివృద్ధికి సహకరించినందుకు పాలకవర్గం తరపున మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మార్కెట్ యార్డులో నూతన షట్టర్లు, బోరు మోటర్, శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మత్తులకు పాలకవర్గం తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను కలిసి సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావును తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. నూతనంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులుగా ప్రమాణం చేసి ఎల్లారెడ్డి కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ను లింగంపేట్ ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జొన్నల రాజు పతియోద్దీన్ ఇమామ్ శ్రీనివాస్ మహేష్ చారి రవి మునీర్ హర్షద్ నదీమ్ మహేష్ గౌడ్ పోతవని రామ గౌడ్ ఇర్ఫాన్ పరంధాములు నలుగుల నరసింహులు ముఖ్య నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే గారికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

జీపీ నుంచి మోటర్ పంపు చోరీపై ఫిర్యాదు



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో 7.5 హెచ్.పి మోటర్ పంపు గ్రామపంచాయతీలోని స్టోర్ రూమ్‌లో నుండి చోరీ జరిగిందని, స్టోర్ రూమ్‌కు తాళం వేసినా మోటర్ పంపు ఏ విధంగా చోరీ జరిగిందని సర్పంచ్ జనగామ శ్రీనివాస్, కార్యదర్శి సౌజన్యను వార్డు సభ్యులు ప్రశ్నించారు. మాకు ఏమి తెలియదని సమాధానం చెప్పడంతో వార్డు సభ్యుడు గజెల్లి భూమలింగం సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భూమలింగం మాట్లాడుతూ తాళం వేసిన గదిలో బోరు మోటర్ చోరీ జరిగినా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో కూడా పాలకవర్గం ఎలాంటి తీర్మానం చేయకున్నా సుమారు 70 వేల రూపాయల బిల్లులు కార్యదర్శి ఆమోదించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో నియంతగా వ్యవహరిస్తున్న సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బడిబయట పిల్లల కోసం సర్వే



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని సర్వాపూర్ గ్రామంలో సోమారం బడి బయట పిల్లల కోసం సర్వే నిర్వహించారు. పాఠశాలకు రాకుండా విద్యకు దూరంగా ఉంటున్న ఇద్దరు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సిఆర్‌పి షాహిద్, ప్రధానోపాధ్యాయురాలు నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పినతల్లితో గొడవ... కొడుకు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్



మారుతల్లితో గొడవ పడి ఉరేసుకొని కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భిక్కనూరు పట్టణ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూరు పట్టణానికి చెందిన వెంకటేష్ (26) తన మారుతల్లి అయినా మంజులతో ఇంటి విషయాలలో చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. గొడవల కారణంగా తీవ్ర మనస్తపంతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గదిలో చూడగా ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల హాజరు ప్రతిరోజు నమోదు చేయాలి

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థుల హాజరు ప్రతిరోజు నమోదు చేయాలని ఎంఈఓ దేవి సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ పరిధిలోని ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ గుర్తింపు యాప్ ద్వారా విద్యార్థుల హాజర్ ప్రతిరోజు నమోదు చేయాలని సూచించారు. యు డైస్ కి సంబంధించిన భౌతిక వసతులు , కావలసిన సౌకర్యములను ఇతరాత్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నోడల్ అధికారి రమణారావు మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలోని ఎఫ్ ఎల్ ఎన్ ఉన్నతి కార్యక్రమాలకు సంబంధించిన తరగతుల వారీగా సబ్జెక్టులను ఆన్‌లైన్ మెంటు సిద్ధం చేయాలని , ప్రత్యేక యాప్ లో విద్యార్థుల ప్రగతి రిపోర్టు , వివరాలను నెలలవారీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇన్చార్జి విట్టల్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆ ప్రాంత క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ దేవి సింగ్

మా సమస్యలు పరిష్కరించండి

● ఉప ముఖ్యమంత్రి కలిసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖలో పనిచేస్తున్న రాష్ట్ర నాయకులు సోమవారం హైదరాబాలో నివాసంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన భట్టి విక్రమార్కను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా తాము విద్యాశాఖలో 15 ను సంవత్సరాలుగా కీలకంగా పనిచేస్తున్నామని చాలీచాలని వేతనాలతో కుటుంబాలు పోషించుకుంటున్నామని కావున తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు యాదగిరి, సహదేవు, రవీందర్, జానకిరామ్, రాములు పాషా, మహేందర్, రాజి రెడ్డి, చందు ఇతరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రిని కలిసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

గ్యాస్ కేవైసీపై ఆందోళన వద్దు

● ఎప్పుడైనా చేయించుకోచ్చు : గ్యాస్ ఏజెన్సీలు



గ్యాస్ ఏజెన్సీల ముందు క్యూలో నిలబడిన ప్రజలు

నవతెలంగాణ-భిక్కనూర్

గ్యాస్ కేవైసీ విషయంలో వినియోగదారులు ఆందోళన చెందవద్దని, దానికంటూ గడువు లేదని, ఎన్నడైనా చేయించుకోవచ్చని భారత్ గ్యాస్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజేశ్వర్, హెచ్.పీ గ్యాస్ నిర్వాహకులు శరత్ కుమార్ శనివారం తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన రూ.500 గ్యాస్.. కేవైసీ చేయించుకుంటేనే వస్తదని పుకారు పుట్టించారని, కేవీసీకి, స్కీమ్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. కేవీసీకి గడువు అంటూ ఏమీ లేదని, ఎన్నడైనా చేయించుకోవచ్చని తెలిపారు. ప్రజలు దీనిని గమనించి గ్యాస్ ఏజెన్సీల ముందు గంటల తరబడి క్యూ లైన్ లో నిల్చొవలసిన అవసరం లేదన్నారు. కేవైసీ విషయంలో తప్పకుండా గడువు పొడిగిస్తారని, ఆన్‌లైన్ సర్వర్ సమస్య కారణంగా రోజు 100 కేవైసీలు మాత్రమే అవుతున్నాయని సమస్యను గుర్తించి ఏజెన్సీలకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు డోంగ్లికి ఎమ్మెల్యే రాక

● ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తోట లక్ష్మీకాంతరావు ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం మొట్టమొదటిసారిగా నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల కేంద్రానికి రేపు(బుధవారం) విచ్చేస్తున్నందున ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సభ నిర్వహించేందుకు స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు సోమవారం పరిశీలించి చదును చేయించారు. సభా స్థలాన్ని కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గజానంద్ పటేల్‌తో పాటు శీను పటేల్, సమీ పటేల్, భాను దాస్ పటేల్, ఎనబోరా సర్పంచ్ హనుమంత్ వెంకట్ తదితరులు కలిసి సభ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. మొట్టమొదటిసారిగా మండల కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్యే కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రత్యేకంగా కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారం తెలిపారు. సమావేశానికి భారీ ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు



క్రీడా పోటీల్లో గెలుపొందిన పోసానిపేట్ విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రస్థాయి 67వ ఫుట్‌బాల్ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి పోసానిపేట్ విద్యార్థులు సత్తా చాటారు. మహబూబ్ నగర్‌లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచారు. దీంతో వారిని సోమవారం సర్పంచ్ మహేందర్ రెడ్డితో పాటు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గురుకులాల క్రీడా పోటీలు



గెలుపొందిన విజేతలతో ప్రిన్సిపల్, తదితరులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం మూడవ రోజు తొమ్మిదవ రాష్ట్రస్థాయి అండర్-19 క్రీడా పోటీలు కొనసాగాయి. విజేతలకు బహుమతులను, జ్ఞాపకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వాయిస్ ప్రిన్సిపల్ సురేందర్ రెడ్డి, గవర్నమెంట్ ఇన్చార్జి ఏ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ శంకర్, డిస్క్ ఇంచార్జ్ వీరేశం, రాజరత్నం, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుగ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి, గన్నారం సబ్ స్టేషన్ ల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంద ని డిచ్‌పల్లి ఏడి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థాన్ సిర్నపల్లి, గన్నారం సబ్ స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి, స్టేషన్ తండా, డొంకల్, గౌరారం, మేగ్య నాయక్ తండా, గన్నరం తో పాటు పరిదిలో ఉన్న తండాల్లో సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అయిన వివరించారు. సదశివ్ నగర్ మండలంలోని యాచారం తండా లో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా 220 కెవి నూతన మరమ్మతులు పనుల దృశ్య విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఎ డి శ్రీనివాస్ తెలిపారు.ప్రజలు, రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

పోస్ట్‌మాన్ సస్పెన్షన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గత కొన్ని మాసాలుగా ఉత్తరాలు పంచకుండా ఇంటివద్దనే ఉంచిన సుభాష్‌నగర్ పోస్టాఫీస్ పోస్ట్ మాన్‌పై క్రమ శిక్షణ చర్యలో భాగంగా సస్పెండ్ చేసినట్లు తపాలా శాఖ సహాయ సూపరింటెండెంట్ రాజా నర్సాగౌడ్ (ఏఎస్పి) సోమవారం తెలిపారు. సుభాష్ నగర్ ఉప తపాలా కార్యాలయంలో పని చేసే పోస్ట్ మాన్ తన దగ్గరకు వచ్చిన ఉత్తరాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయకుండా 5,6 నెలల నుంచి ఇంట్లోనే ఉంచుకున్నారని ప్రజల ఫిర్యాదు మేరకు పరిశీలించామని పేర్కొన్నారు. ఎంక్వయిరీలో పోస్ట్ మాన్ ఇంటి వద్ద సుమారు 11 సంచుల ఉత్తరాలు ఉండటంతో ఆ ఉత్తరాల సంచులను సుభాష్ నగర్ పోస్ట్ ఆఫీస్‌కు తీసుకువచ్చి పరిశీలించామని తెలిపారు. అందులో పాన్, ఓటర్ ఐడి కార్డ్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, బ్యాంక్ చెక్ బుక్, తదితర ఉత్తరాలున్నాయని, వాటిని త్వరలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర బస్సులు ఎక్కడికి వెళ్ళిన ఉచితం అమలు చేయాలి

- రైతు రుణమాఫీ చేయాలి
- మండల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల్లో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం హర్షణీయమని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఆర్టీసీ బస్సులు ఇతర రాష్ట్రాలకు వెళ్తే అక్కడి వరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ఇందల్ వాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తమ శాఖద్వారా చేసిన పనుల పురోగతి తదితర వాటిపై సభా దృష్టికి తీసుకొని వచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్య అధికంగా ఉందని గత సర్వసభ్య సమావేశంలో పనికిరాని వాటిని తొలగిస్తామని స్తంభాలు ఉన్నాయని అనాడు చెప్పిన నేటి వరకు ఆ స్తంభాలను మార్చలేదని ఎంపీటీసీలు సర్పంచులు సభ దృష్టికి తీసుకుని వచ్చారు. ఏఈలు పండరి, జ్ఞానేష్ మాట్లాడుతూ.. ఇంతకుముందు చెప్పిన స్తంభాల మాట వాస్తవమేనని అత్యవసరంగా కొన్ని రోజుల క్రితం పడిన వర్షాలకు స్తంభం విరిగిపడడంతో అక్కడ మార్చడం జరిగిందన్నారు. స్తంభాలు వచ్చిన వెంటనే అవసరాల మేరకు వేయడం జరుగుతుందని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి పాఠశాలలో స్థితిగతలపై వివరించారు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో అనేక పాఠశాలలో అనుకున్న స్థాయిలో ఉత్తీర్ణత రాలేదని దానికి కారణం ఏముంటుందని పలువురు ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారి సమాధానమిస్తూ పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పాఠశాలలో తీసుకోవడం జరుగుతుందని మరోసారి జరిగే వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన పనుల వివరాలను ఏఈ కిషన్ సభ దృష్టికి తీసుకుని వచ్చారు. ఇంకా వందకు పై చిలుకు పనులు చేపట్టవలసి ఉందని, ఎక్కడ నూతనంగా పనులు చేపట్టవద్దని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చిన తర్వాత పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. జరుగుతున్న పనులకు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందజేసినట్లు వివరించారు. పశువైద్యదికారి గంగాప్రసాద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమలకు అందజేసిన సబ్సిడీపై గొర్రెలను 32 యూనిట్లను అందజేయడం జరిగిందని తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఈ పథకంపై వివరించలేమని తెలిపారు. అనంతరం ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో టిపిసిసి అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు హామీలను అమలు చేస్తామని చెప్పారని, డిసెంబర్ 9వరకు రైతులకు సంబంధించిన డబ్బులు వేయడం జరుగుతుందని చెప్పారని, కానీ నేటి వరకు డబ్బులు రైతు ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. ఆరు గ్యారెంటీలలో ప్రతి ఒక్క గ్యారెంటీలో ఐదు నుండి ఆరు అంశాలు ఉన్నాయని, దానిలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ మాత్రమే అమలు చేశారన్నారు. మిగతా వాటిని కూడా పూర్తి చేయాలని వివరించారు. ఈ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందని ఆశ భావాన్ని వ్యక్తం చేస్తున్నానని, నూతనంగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వానికి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డికి,శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం లో జడ్పీ టీసి సుమన రవిరెడ్డి, వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, ఎంపిడిఓ రాములు నాయక్,ఎంపిటిసిలు కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, చింతల దాస్, సుధాకర్, బాబు రావు, లలితా గణేష్,ఎంపిఓ రాజ్ కాంత్ రావు,ఎఈలు కిషన్, డిప్ చంద్,పండరి, మాధురి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మిషన్ భగీరథ ఎఈ,ఎపిఎం సువర్ణ,ఎపిఓ పోశెట్టి, కంట్రోలర్ గంగా దాస్, సర్పంచులతో పాటు అదికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాదవత్ రమేష్ నాయక్

ఖానాపూర్ బీరప్ప కళ్యాణంలో పాల్గొన్నా ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బీరప్ప కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం డివిజన్-1 ఖానాపూర్ గ్రామంలో 9 సంవత్సరాల తర్వాత బీరప్ప కల్యాణ మహెూత్సవ వేడుకల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి పాల్గొన్నారు. కురుమ గొల్ల సంఘం వారు ఘనంగా బీరప్ప కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగా రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, బాడ్సి శేఖర్ గౌడ్, రూరల్ డివిజన్ కార్పొరేషన్ అధ్యక్షులు కొర్వ రాజేంద్రప్రసాద్, రాజలింగం, ఉషన్న, బొంతెట్టి శ్రీనివాస్, భోజన్న, మహేందర్, నరేష్, వీరేందర్, గ్రామ విలేజ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి

నవతెలంగాణ-ముప్కాల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను, రవాణా రంగంలోని వాహనాల యజమానులను ఆదుకునేలా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని బాల్కొండ ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు జోగు సంగీత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఆరు గ్యారెంటీలతో ముందుకు రావడం జరిగిందని, అందులో ఒకటి మహిళలకు ఆర్టీసీ బస్సులలో రవాణా ఉచితం అని తెలిపారు. ఈ నిర్ణయంతో మరొకరి ఉపాధిపై భారం పడు తుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం అభినం దించదగ్గ విషయం అయినప్పటికీ లక్షలాదిమంది కార్మికులు, డ్రైవర్ల యజ మానులు, రవాణా రంగం మీద ఆధారపడి ఉన్నారన్నారు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఆటో డ్రైవర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు..

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు



హాకీ పోటీలకు ఎంపికైన తూంపల్లి విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిజామాబాద్ వారు నిర్వహిస్తున్న అండర్ 14 బాలబాలికల ఉమ్మడి జిల్లాల హాకీ పోటీలకు మండలంలోని తుంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయినట్లు పిఈటీ నగేష్ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలు ఈ నెల 16 నుండి 18 వరకు కామారెడ్డి జిల్లాలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు రామ్ చరణ్, నితిన్, షాహిద్, భారత్, శివశరత్, సిద్ధు, జాగృతి, అమ్ములు, అఖిల, జశ్విత, శ్రీనిధి, అక్షయ ఎంపికయ్యారని అన్నారు. క్రీడాకారులను ప్రదానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, ఎంపీటీసీ లింగం, ఎస్ఎంసి చైర్మెన్ లావణ్య, విడిసి సభ్యులు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, సెక్రెటరీ రమణరెడ్డి తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని మంగల్‌పాడ్ చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన శంకర్ అనే యువకుడు మద్యం మైకంలో ఆటోను ఎడపల్లిలోని వివేకానంద విగ్రహ సమీపానగల మెకానిక్ దగ్గర తన ఆటోను బాగు చేయించుకున్నారు. ఆటోను అతివేగంగా రోడ్డు దాటించడంతో నిజామాబాద్ వైపు బుల్లెట్‌పై వెళ్తున్న ఓవ్యక్తికి ఒక్కసారిగా అడ్డు రావడంతో ఢీకొట్టాడు. బుల్లెట్‌పై నున్న వ్యక్తి తప్పుకాదని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు వివరించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉంటాడని ఆటో డ్రైవర్లతో పాటు స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈప్రనమాదంలో ఆటోడ్రైవర్‌తోపాటు బుల్లెట్‌పైన ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో ఇరువురిని స్థానిక పోలీసులు నచ్చజెప్పి పంపించేశారు. ఈ విషయమై ఎడపల్లి పోలీసులకు వివరణ కోరగా తమకు ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

చక్కర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించి నడిపించాలి

- అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్)

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ జిల్లాలో గల మూతపడిన రెండు చెక్కెర ఫ్యాక్టరీలను కొత్త ప్రభుత్వం తెరిపించి నడిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎంఎస్ గౌరవ అధ్యక్షులు రైతు నాయకులు నాయక్ వాడి నర్సయ్యతో అర్సపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేల్పూర్ భూమయ్య మాట్లాడారు. రైతులు, ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించు కోలేని స్థితిలో బంగారు తెలంగాణ అంటూ ప్రజలను నమ్మించి వేలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టి అధికారంలోకి తెచ్చారని భూమయ్య అన్నారు. కొత్త ప్రభుత్వం అనేక సభల్లో చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని చెప్పిన సందర్భాలు ఉన్నాయని ఆయన అన్నారు. చక్కెర ఫ్యాక్టరీలు నడిచిన రోజుల్లో రైతులకు, కార్మికులకు మంచి ఉపాధి ఉండేదని తెలిపారు. చెరుకు పంటను పండించిన రైతులు దాని ద్వారా వచ్చిన డబ్బులతో పిల్లల చదువులు, పెండ్లిలు చేశారని, ఇండ్లు కట్టుకొని ఆనందంగా ఉండేవారని గుర్తు చేశారు. అలాంటి ఫ్యాక్టరీలు మూతపడడం మూలంగా ఒక్క వరి వైపే మొగ్గు చూపుతున్నారని, ఆరుతడి పంటల వైపు రైతులు మరలాలన్న చెరుకు పంట కూడా ఆరుతడి పంటనే కాబట్టి ఫ్యాక్టరీలు తెరిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉందని అన్నారు. ఫ్యాక్టరీని తెరిపించాలని గతంలో రైతులు అనేకసార్లు విజ్ఞప్తులు ఆందోళనలు నిర్వహించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోలేదని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఈ జిల్లాలో పాదయాత్రను చేసిన సందర్భాల్లో మూతపడిన చెరుకు ఫ్యాక్టరీలను తెరిపిస్తానని ఆయన అన్నారని గుర్తు చేశారు. చెరుకు పండించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణలో సహకార రంగంలో కొనసాగిన ఏకైక చక్కెర ఫ్యాక్టరీ ఎన్సీఎస్ఎఫ్ చెక్కర ఫ్యాక్టరీ పై ఉన్న అప్పులు మాఫీ చేసి ఫ్యాక్టరీని తెరిపించి నడిపించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు నాయకుడి నరసయ్య, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు టి. కృష్ణ గౌడ్, అగు ఎర్రన్న, బి.సాయిలు గోపాల్. దండు చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

- తనను కలిసిన గ్రాప్లింగ్ క్రీడాకారిని నేహాతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్



ఎమ్మెల్యేను కలిసిన గ్రాప్లింగ్ క్రీడాకారిని నేహా

మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన నేహా గత నెలలో రష్యా అంతర్జాతీయ గ్రాప్లింగ్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించినందుకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నేహాని సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అనేక పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి అలాగే మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కొనియాడారు ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా చూస్తామని అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూర్పు రాజేష్, ముత్యంరెడ్డి, మహేష్, భాస్కర్ మునిపల్లి సాయిరెడ్డి, ప్రీతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈగ గంగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఈగ గంగారెడ్డిని డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల కాలంలో ఆయన అనారోగ్యానికి గురైన సందర్భంగా ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యే అయిన తర్వాత డాక్టర్ భూపతిరెడ్డి తొలిసారిగా తన ఇంటికి వచ్చినందుకు ఈగ గంగారెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన
ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ఉచిత బస్ సౌకర్యంవల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని, ఉచిత బస్ సౌకర్యంవల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షులు పూర్ణానందం అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా మండలాధ్యక్షులు పూర్ణానందం మాట్లాడుతూ... 3వ సారి వేముల ప్రశాంత్ రెడ్డి గెలుపుకోసం కృషిచేసిన కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేస్తామన్న ప్రభుత్వ పథకాలు సత్వరమే అమలు పరచాలని, అన్న మాట ప్రకారంగా డిసెంబర్ 9 న రైతులకు 2 లక్షల రుణమాఫీ వెంటనే అందించాలని, రైతు భరోసా కింద విడుదల చేస్తానన్న డబ్బులు వెంటనే విడుదల చేయాలని, పెన్షన్ దారులకు 4 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. యాసంగి వరి నాట్లు వేస్తున్న తరుణంలో రైతన్నల అకౌంట్లో ప్రభుత్వం రైతు భరోసా కింద డబ్బులు ఎప్పుడు వేస్తారోనని ఎదురుచున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు,ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలు పట్ల అలసత్వం వహిస్తే ప్రజల వైపు బీఆర్ఎస్ పార్టీ ఉండి పోరాటం చేస్తుందని అన్నారు. అలాగే ఉచిత బస్ ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్,కుండ నవీన్,కట్కం పద్మసాగర్, పత్తిరెడ్డి ప్రకాష్, గద్దె రాధ గంగారాం, మంజుల బాలాజీ గౌడ్, భాను ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కేసీఆర్ తొలగించిన దివ్యాంగుల శాఖను
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలి

- దివ్యాంగులకు అన్ని రకాల బస్సు సర్వీసుల్లో పూర్తి రాయితో ప్రయాణ సౌకర్యాం కల్పించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల సంక్షేమ శాఖను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ తొలగించారని, ఆ శాఖను తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేయాలని, దివ్యాంగులకు అన్ని రకాల బస్సు సర్వీసులో పూర్తి రాయితో కూడిన ఫ్రీ బస్సు ప్రయాణం కల్పించాలని, నిరుపేదలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, పెన్షన్లను ఆరు గ్యారంటీల తోపాటు 6వేల పెన్షన్‌ను పెంచాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత వికలాంగుల సమాజం అడుగడుగునా వివక్షకు గురైందని, ఇప్పుడు ఏర్పడిన ప్రభుత్వం మొదటి ఉద్యోగం దివ్యాంగురాలుకు కల్పించి మాలో ఆత్మవిశ్వాసం పెంచినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నామని రూరల్ దివ్యాంగుల సంఘం కన్వీనర్ కుంట మహిపాల్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యలు నూతన ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి దివ్యాంగుల ప్రతి సమస్య తీర్చాలని పేర్కొన్నారు. ట్రై సైకిల్స్, బ్యాటరీ వెహికల్స్, మోటార్ సైకిల్, అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పించి, సమాజంలో అత్యంత దిగువన ఉన్న దివ్యాంగులను అన్ని విధాలా ఈ ప్రభుత్వం సహాయ సహకారం అందిస్తుందని కోరుకుంటున్నామని వివరించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వేడుకున్నారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం సభ్యులు నవీన్ కుమార్, బలరాం నాయక్, నల్లవెల్లి మహిపాల్, అంకం గంగాధర్, కుమ్మరి జమున, కుంట జమున, అబ్బవ్వ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యక్షత్రియ సంఘాన్ని అభివృద్ధి చేస్తా

- సంఘం నూతన అధ్యక్షులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

సంఘాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆర్య క్షత్రియ సంఘం నూతన అధ్యక్షులుగా మీసాల సుధాకర్ రావు అన్నారు. నగరంలోని శివాజీ నగర్‌లోగల ఆర్యక్షత్రియ సంఘంలో సోమవారం ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా గైక్వాడ్ మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్ రావు, ఉప కార్యదర్శిగా కోనేరు గంగాధర్ రావు, కోశాధికారిగా రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మీసాల సుధాకర్ రావు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధియే తన ధ్యేయమని సంఘంలో ఉన్న సభ్యులకు చేదోడు వాదోడుగా ఉంటానని, తెలిపారు. 20 సంవత్సరాల నుండి నెలకొల్పబడిన ఆర్య క్షత్రియ సంఘం క్రమేపి పుంజుకొని నేడు ఛత్రపతి నగర్‌లో స్థలాన్ని సేకరించామని త్వరలోనే సంఘ అభివృద్ధి పనులుచేస్తామని, రాబోయే రోజుల్లో ఛత్రపతి నగర్లో ఆర్య క్షత్రియ సంఘ భవనం ప్రత్యేకంగా రూపు దిద్దుకుంటుందని తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్.ఏం. యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెలలో జరిగే డిగ్రీ పరీక్షల నిర్వహణపై సోమవారం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సెమినార్ హాలులో జరిగిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్.యం. యాదగిరి పాల్గొని మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, సౌకర్యవంతమైన సీటింగ్ అరేంజ్మెంట్‌తోపాటు తాగునీరు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. పరీక్షలు సమయపాలన పాటిస్తూ కళాశాల యాజమాన్యం మాల్ ప్రాక్టీస్‌కు సహకరించకుండా తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్.ఎం అరుణ మాట్లాడుతూ.. కళాశాలలకు కావలసిన స్టేషనరీ ముందస్తుగా యూనివర్సిటీ నుండి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్.బి.సాయిలు, డాక్టర్ బి.నందిని, పి.డాక్టర్ శాంతాబాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్, తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా మహిళా సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల నిండిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహం చేయాలని, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన పౌష్టికాహారం గురించి వివరించారు. బాలల సంరక్షణ అధికారి జమ్రుద్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలు కనిపించిన వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేయాలని విద్యార్థినిలకు సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకురాల్లు సరస్వతి, సవిత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సూపర్వైజర్ బిక్ సింగ్, అంగన్వాడీ టీచర్లు యమున, మంజుల, దివ్య, గంగజమున, తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ



మండలకేంద్రంలోని మహిళా సహకార సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఉదయ్ ఆక్వా కనెక్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపల పెంపకంపై, చేపల మార్కెటింగ్‌పై ఉమ్మడి బాల్కొండ మండలానికి సంబంధించిన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో ఉదయ ఆక్వా కనెక్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ట్రైనర్ నితిన్ బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాలకు సంబంధించిన ఏపిఎంలు, రైతులు పాల్గొన్నారు.

వికాసిత్ భారత్‌తోనే స్వశక్తి భారత్ ఆవిర్భావం

- గవర్నర్ తమిళిసై సౌందర రాజన్
- వికసిత భారత్ రోడ్ మ్యాప్ పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ప్రధాని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారతదేశం 2047లో జరిగే 100వ స్వతంత్ర వేడుకల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించేందుకు వికసిత భారత్ రోడ్ మ్యాప్ పోర్టల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని అన్ని రాష్ట్రాల రాజ్ భవన్‌లలో గవర్నర్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రాజ్‌భవన్‌లో జరిగిన కార్యాశాలలో రాష్ట్రంలో ఉన్న 11యూనివర్సిటీలతోపాటు 10 పరిశోధక సంస్థల వైస్ ఛాన్సలర్స్, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు యువ పరిశోధకులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ తమిళిసై సౌందర్ రాజన్ ఈసందర్భంగా మాట్లాడుతూ.. వికసితభారత్‌తోనే స్వశక్తి భారత్ ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. ఉన్నతమైన లక్ష్యాలు మహోన్నతమైన గమ్యస్థానాలకు చేరుస్తాయని అభిప్రాయ పడ్డారు. ఈ ప్రపంచంలోనే యువ జనాభా అధికంగా ఉన్న భారతదేశంలో విద్య, పరిశోధన రంగాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందితేనే మానవ అభివృద్ధి జరుగుతుందని



రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో పాల్గొన్న టీయూ ప్రొఫెసర్లు

పేర్కొన్నారు. ప్రొఫెసర్లు దీనికోసం దేశంలో ఉన్న 1200లకుపైగా యూనివర్సిటీలు 15 వేలకు పైగా ఉన్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్న పరిశోధనా సంస్థలు నాణ్యమైన విద్యతోపాటు, పరిశోధనలను అభివృద్ధి పరచాలన్నారు. దీని కోసం యువ విద్యార్థుల మెదళ్లలో పరిశోధనాత్మక, ఆలోచనలను రగిలించి అభివృద్ధి చెందే దేశంగా భారత్ ను ముందు వరుసలో నిలబెట్టుటకు అడుగులు వేయించాలని సూచించారు. శాస్త్ర సాంకేతి విజ్ఞానం అభివృద్ధికి మూలధాతువుగా ఉపయోగపడుతుందని, దీనితోనే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు ముందుకు దూసుకుపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్. ఎం. యాదగిరి ఆదేశాల మేరకు ప్రొఫెసర్ లావణ్య డాక్టర్ శిరీష, డాక్టర్.వాసం చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజ్ పాత, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ పున్నయ్య, డాక్టర్ అబ్దుల్ ఖవి, డాక్టర్ లలిత, డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్. సమత తదితరులు హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలసి పూలబొకేను అందించి శాలువా కప్పి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ నగరంలో ఉన్న సమస్యలపైన చర్చించారు.

లిల్లీపుట్ పాఠశాలలో ఎల్లో కలర్ డే



ఎల్లో కలర్ డ్రెస్‌లో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో ఎల్లో కలర్ పసుపు రంగు దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ పసుపు రంగు దుస్తులతో వచ్చి అందరిని అలరించారు. అంతేకాకుండా పసుపు రంగు వస్తువులను అనగా అరటిపండు, సన్ ఫ్లవర్ వంటి చార్ట్ చక్కగా తయారు చేసుకొని తీసుకువచ్చారు. విద్యార్థులందరూ చక్కని డాన్స్ తో అందరినీ ఎంతగానో అలరించారు . ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ... పసుపు రంగు అనేది వాస్తు శాస్త్రం ప్రకారం మనసుకు ప్రశాంతతను ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు. ఈ పసుపు రంగు శక్తికి, వెలుగుకు సూచన అని, ప్రతి ఇంట్లో పసుపు రంగుకు ఎంతగానో వాడకంలో ఉంటుందని, పసుపు రంగుకు సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు కరస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రి మత్తు వైద్యురాలు ఆత్మహత్య

వ్యక్తిగత కారణాలతోనే..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవ నగర్‌లో ఇందూర్ క్యాన్సర్ ఆసుపత్రి మత్తు వైద్యురాలు ఆత్మహత్య చేసుకుంది. మత్తు వైద్యురాలుగా పనిచేస్తున్న కుమారి పైల సౌమ్య తన వ్యక్తిగత కారణాల మత్తు ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త రూరల్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై మహేష్ తెలిపారు.

ప్రకృతి సంపదను కొల్లగొడితే ఊరుకునేది లేదు

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్

నిబంధనలకు విరుద్ధంగా పకృతి సంపదను కొల్లగొడితే ఊరుకునేది లేదని ఎంఎల్ఏ పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్, మాక్లూర్ మండల కేంద్రంలోని క్రషర్ బ్లాస్టింగ్ ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులను కాపాడటం ప్రజా ప్రతినిధులుగా తమ బాధ్యత అని అన్నారు. ఎవ్వరి మీద ద్వేషం లేదని ప్రజల తరుపున మాట్లాడుతున్నానని అన్నారు. కొండలను బ్లాస్ట్ చేయడానికి భారీ బాంబులను ఉపయోగించడం వలన ఆ శబ్దాలకు సమీప ప్రాంతంలో నివసించే మహిళలు గర్భస్రావాలు సైతం అయిన సంఘటనలు ఉన్నాయని, వీటన్నింటికీ కారణం మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అని అన్నారు. వీటి వల్ల వడ్డెర కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారికి ఉపాధి కరువైందని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క లెక్క ఇప్పటి నుంచి మరో లెక్క అని, ప్రతిఒక్కరూ రూల్స్ ఫాలో అవ్వల్సిందేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యాపారాలు చేసుకోవాలని,



క్రషర్ ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించి, ట్యాక్సులు కట్టి లెక్క ప్రకారం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవని తెలియజేశారు. చాలా ఎక్కువ లోతు వరకు తొవ్వి గుతలు ఏర్పడేలా బ్లాస్టింగ్ చేయడం వల్ల దగ్గరలో ఉన్న ఇళ్లకు పగ్గుల్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు ఎంత తోడారు, ఎంత అనుమతులు ఉన్నాయి అనేదానిపై ఆరా తీయాలని మైనింగ్ ఎడి సత్యనారాయణకు ఆదేశాలు జారీచేశారు. వ్యాపారుల వద్ద ఎంత వరకు అనుమతులు ఉన్నాయి అనే దానిపై వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలా చేశారు అనేది కాదు ఇప్పటి నుంచి అందరూ ప్రజల కోసం పనులు చేయాలని, ఎవ్వరూ పై తనకు ఎలాంటి శతృత్వం లేదని తెలిపారు. అక్రమ క్వారీల పైన సిబిసిఐడి విచారణ జరిపించాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆర్మూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక దృష్టి సాగించాలని తెలియజేస్తానని అన్నారు. ఇప్పటివరకు మైనింగ్ ఏ రకంగా జరిపించారు, క్రమ విక్రయాలను పూర్తిగా వివరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంతవరకు మైనింగ్ పనులను నిలిపివేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో మైనింగ్ ఎడి సత్యనారాయణ, తహశీల్దార్ షబ్బీర్, అర్ఐ శిపి, బిజెపి మండల అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు రవి యాదవ్, నాయకులు రాజేశ్వర్, హన్మండ్లు గౌడ్, శివ కుమార్, మధరి రాజు, బిజేవైఎం నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు..

ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని జక్రాలపల్లి మండల మైనారిటీ అధ్యక్షులు అక్బర్ ఘనంగా సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి సంతోషాన్ని వ్యక్తం చేశారు . కార్యక్రమంలో జక్రాన్ పల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మండల మైనార్టీ అధ్యక్షుడు అక్బర్ సైకిల్, నిజాంబాద్ రూరల్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ రహమతులి తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్టలో భక్తులనుండి దోపిడీని అరికట్టాలి

- సీపీఐ(ఎం)

నవతెలంగాణ-వర్ని

బడాపహాడ్‌లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా వ్యవరిస్తూ భక్తుల నుంచి అధిక దోపిడీ చేస్తున్నారని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నెసాబ్ అన్నారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుణ్య క్షేత్రమైన బడాపహాడ్ లో భక్తుల నుండి బడా దోపిడీకి పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి దోపిడీపై నియోజకవర్గ ఇంచార్జి లు దృష్టి సారించాలని కోరారు. బస్టాండ్ నుండి దర్గా వరకు మెట్లకు మరమ్మత్తులు చేసి భక్తులకు ఒక రూపాయి ఖర్చు లేకుండా దర్శనం చేసుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భక్తులు బస చేయటానికి షెల్టర్లు ఏర్పాటు చేసుకున్న వ్యక్తులు భక్తుల వద్ద రూ, వెయ్యి నుండి రెండు వేలు అధికంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మేకలు వధించే దగ్గర అధిక డబ్బులు వసూలు చేస్తూ, తలకాయ , కాళ్లు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇతరులకు 500 వరకు



మాట్లాడుతున్న వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్

అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. ధరల పట్టిక లేకపోవడంతో వ్యాపారస్తులు అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి భక్తులకు రక్షణ కల్పించాలన్నారు . భక్తుల వసముతో వచ్చిన ఆదాయం ప్రభుత్వానికి చెల్లించకుండా, కాంట్రాక్టు కాలపరిమితి దగ్గరికి వస్తున్నప్పటికీ వేలం పాట డబ్బులు చెల్లించినట్లు అధికారుల వద్ద లెక్కలు లేకపోవడం చూస్తే బడాపర్ లో బడా దోపిడీ జరుగుతున్నట్లు కంటికి కనబడుతుందని అన్నారు. ప్రభుత్వానికి గండి పెట్టే కాంట్రాక్టర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని, డబ్బులు వక్ఫ్‌బోర్డ్ రికవరీ చేయాలని అన్నారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సాయిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగుల బీమా కింద ప్రభుత్వం జారీ చేసిన రూ .1.50. లక్షల చెక్కును మృతుడి కుటుంబీకులకు సోమవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అందజేశారు. కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి ఐకెపి సమన్వయకర్తగా పనిచేసిన సాయిలు ఇటీవల మృతి చెందడంతో ఉద్యోగుల బీమా కింద రూ.1.50 లక్షల చెక్కును కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మృతుడి భార్య సవితకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాయిలు, డిపిఎంలు సుధాకర్, వకుల పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానించిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి రాకేష్ రెడిని సోమవారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, కుల వృత్తుల వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భాను ప్రకాష్, ఉపాధ్యక్షులు వీరాచారి, క్యాషియర్ తిరుపతి, సెక్రటరీలు నర్సింలు, రవికుమార్, గౌరవ అధ్యక్షులు జి ఎం నర్సయ్య, చంద్రయ్య, సొక్కాల గోవర్ధన్, అజంతా రాజారాం తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసం నందు సోమవారం గోసంగి యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యేను శాలువా పూలదండతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంధం గంగాధర్,టేకు సంతోష్,చిరంజీవి రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ఎస్ఐ సుధాకర్

నవతెలంగాణ-రామారెడ్డి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్ఐ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని గంగమ్మ వాగు వద్ద వాహనాలను తనిఖీ చేసి, ధ్రువపత్రాలు లేని 50 మంది వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... వాహన దారులు ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, మద్యం మత్తులో వాహనాలను నడపవద్దని, మైనర్లకు వాహనాలను నడపడానికి ఇవ్వకూడదని, అతివేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది శ్రావణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎమ్మెల్యేకు బొకేతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎల్లాడి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి భారీ మెజార్టీతో గెలిచి ఎల్లారెడ్డికి వచ్చిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి వస్తున్న సందర్భంగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెదక్ సరిహద్దు అయిన పోచారం డ్యామ్ వద్ద మధ్యాహ్నం ఘనంగా స్వాగతం పలికారు. అక్కడే మదన్ మోహన్ రావుకు శాలువాతో సన్మానం చేసి వీర తిలకాన్ని దిద్దారు. అనంతరం నాగిరెడ్డి మండలంలోని తాండూర్ గ్రామంలో పురాతనమైన త్రిలింగేశ్వర ఆలయానికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి ఆయా గ్రామాల్లోని నాయకులను సందర్శిస్తూ ఎల్లారెడ్డికి చేరుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న లక్ష్మణ్, గాయజోద్దిన్, చింతల శంకర్, షేర్ల సోమేశ్వర్, భిక్కనుర్ సంజీవ్ రెడ్డి, కూర బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని అంచనూరు రోడ్డు ప్రాంతంలో ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసై మురళి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు ధ్రువపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని, నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానాలు విధించమని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది లింగం, కిరణ్ ఉన్నారు.

వికలాంగుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి

నవతెలంగాణ-కామారెడ్డి



కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల కోసం మేనిఫెస్టోలో 29 వ అంశంలో పేర్కొన్న సంక్షేమ పథకాలైన ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, నెలకు 6 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేటి సమాజంలో ధనీక-పేద, సకలాంగులు - దివ్యాంగులు 4 వర్గాలుగా గుర్తించాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో పాల్గొన్నారని, కానీ గతంలో కేసీఆర్ ఎన్నడూ పాల్గొనలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు సంక్షేమం పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, జిల్లా అధ్యక్షులు పుర్ర బాల్ రెడ్డి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన లక్కాకుల మానస (27) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. నొప్పి తగ్గకపోవడంతో, సోమవారం ఉదయం 8గంటలకు భర్త ఇంట్లో లేని సమయంలో మనస్థాపం చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మానస ఏడు నెలల గర్భిణి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మానస మృతదేహం

విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు డి.ఈ.ఓ, ఎం.ఈ.ఓ లు విద్యను వివిధ పాఠశాల యజమాన్యాలు వ్యాపారంగా మార్చి విద్యాసంస్థలు నడిపిస్తురన్నా వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొన్ని పాఠశాలల భవనాలు ఇంటి నిర్మాణం కొసం నిర్మించిన వాటిలో పాఠశాలలు నిర్వహిస్తున్నారని, అట్టి వాటికి జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారో వాటిపై



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విచారణ చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసులు చేస్తూ, పుస్తకాలు అమ్ముతున్నారని, పాఠశాలలకు ఆటస్థలం, రక్షణ వ్యవస్థలు లేని వాటికి అనుమతులు ఇవ్వడముతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఈ విషయాలై విద్యార్థి సంఘాల నాయకులం వెళ్లి డి.ఇ.ఓ కు ఎం.ఈ.ఓ కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా వారు ఆ పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోవడము లేదన్నారు. డీ.ఈ.ఓ, ఎం.ఈ.ఓ లపై కఠిన చర్యలు తీసుకోని నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సభావత్ వినోద్ నాయక్, ఏఐఎఫ్డిఎస్ విద్యార్థి సంఘం అధ్యక్షులు జబ్బర్ సింగ్ నాయక్ సంఘాల నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందించిన సీఐ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల సి.ఐ రామన్ సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, మర్యాద పూర్వకంగా కలిసి నట్లు తెలిపారు. మధన్ మోహన్‌కు పుష్ప గుచ్ఛం అందించినట్లు తెలిపారు. ఈయనతో పలువురు ఎస్సై లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.